# ప్లాటు

"ఇంటి గురించే ఆలోచన లేదు మీకు" అంది శారద సుబ్రమణ్యంతో.

పళ్లెంలో చేతులు కడిగేసుకుంటూ ఓరచూపుతో శారద వైపు చూసి "ఎందుకు లేదు లేవే - ఒక మంచి ప్లాటు చూడమని శంకర్‌తో చెప్పాను. రేపెట్లా ఆదివారం కదా! వెళ్లి చూసొస్తాను" అన్నాడు సుబ్రమణ్యం.

"ఎందరెందరికో ఇంటి స్థలాలు లేని వాళ్లకి ప్లాట్లు మంజూరు చేయిస్తూ ఉంటారు. అట్లే మనకూ ఒక ప్లాటు సంపాదించలేకపోతిరి. మీరు ఈ కాలంలో పుట్టాల్సిన వాళ్లు కాదు. మీతో పాటే చేరిన క్లర్కులు చూడండి, ఆరై కోర్సు అయిపోయేటప్పటికి రెండు 'ల' కారాలతో మంచి ఇల్లో, మంచి సెంటర్లో రెండు మూడు ప్లాట్లో సంపాయించారు. మోటారు బైకుల్లో తిరుగుతున్నారు. మీకూ! ఈ బాడిగ ఇల్లూ, ఆ డొక్కు సైకిలూ తప్ప మరేముందీ.. అదేదో బినామీ పేరో ఏందో అంటారే అట్లా పేరుతో ఒక ప్లాటు సంపాదించండి!" అందామె. తలైనా ఎత్తకుండా గదిలో ఉన్న తడిని పాడిగుడ్డతో తుడుస్తోంది.

సుబ్రమణ్యం మరేమీ మాట్లాడదల్చుకోలేదు. సిగరెట్టు తాగుతూ మంచంపై కూచుని ట్యూబ్‌లైటు వెలుతుర్లో బల్లి పురుగుల్ని వేటాడే తీరుని గమనిస్తున్నాడు. భార్య మాటలకి సమాధానమివ్వలేని మనిషి కాదతను. గతంలో ఈ మాటలకి ఎన్నిసార్లో జవాబు చెప్పి, ఇక లాభం లేదని మానుకున్నాడు.

తాంబూల పళ్లెం ముందుంచుతూ "మౌనంతో నాకు సమాధానం ఇవ్వాలనుకున్నారా ? ఏమైనా సరే మీరు ఎట్లో ఒకట్ల ఒక ప్లాటు సంపాయించాల్సిందే. మీరు కొంటారో, ఫ్రీగా తీస్తారో నాకైతే తెలీదు. లోన్ చేసి ఇల్లు కట్టుకుందాం!" అందామె - ఆకులకి సున్నం రాసి, వక్కపొడి తగినంత వేసి ఇచ్చింది శారద. ఇష్టంగా తాంబూలం అందుకుని "ఊ" "ఊ" అన్నాడు సుబ్రమణ్యం.

ఆమె చెబుతూనే ఉంది.

అతను 'ఊ' కొడుతూనే ఉన్నాడు. పెదవి విప్పకుండా -

ఆమెకు తెలుసు అతను తన మాటలన్నీ వినడం లేదని, అయినా ఆపదామె.

ఆమె మాటలకి అతను ఫుల్‌స్టాప్ పెట్టడు. అది తనకు చేతనయ్యే వ్యవహారం కాదని అతనికి తెలుసు. అందుకే ఆపమని ఆమెని అనడు.

అతను తాంబూలం నమిలాడు ...

ఆమె మాట్లాడుతూ ఉంది ...

నోరు మరీ ఎర్రగా అయ్యేలా నమిలాడు ...

ఆమె మాట్లాడుతూ ఉంది ...

మరో సిగరెట్టు అంటించాడు ...

ఆమె మాట్లాడుతూ ఉంది ...

సిగరెట్టుని చివరికంటా కాల్చాడు...

ఆమె మాట్లాడుతూ ఉంది.

మంచంపై హాయిగా మేను వాల్చాడు ...

ఆమె మాట్లాడుతూ ఉంది ...

కళ్ళు మూసుకున్నాడు .. .. ..

ఆమె మాట్లాడుతూ ఉంది ...

కొద్ది క్షణాల్లోనే "ఊ" కొట్టడం కాస్త గురకగా మారింది .. ఆమె మాట్లాడుతూనే ఉంది..

గురక వినిపిస్తూంటే అతని వైపు చూసిందామె. 'కర్మ' అనుకుని నుదుటిపై సున్నితంగా కొట్టుకుని, పిల్లలిద్దర్నీ సరిగ్గా పరుపు పైన పడుకోబెట్టి దోమతెరను సరిగ్గా సర్ది లైటు ఆఫ్ చేసి పడుకుంది శారద.

భర్త అంటే శారదకు అమితమైన ప్రాణం - అయితే, సంపాదన విషయంలోనూ, స్వంత ఇంటి విషయంలోనూ అతను చూపుతున్న అజాగ్రత్త అంటే ఆమెకు అరికాలి నుంచీ మండుతుంది. అతని నీతీ నిజాయితీలు అంటే ఆమెకి మహా కోపం. ఈ మనిషి నన్ను అన్యాయం చేశాడు. పిల్లలకీ అన్యాయం చేస్తాడేమోనని ఆమె మనసు పెనుగులాడుతుంది. నీతీ నిజాయితీలు అంటే ఆమెకి ఇష్టమే - ఆ నీతీనిజాయితీల వల్ల తమకు ఉపకారమే జరగాలి గానీ, అపకారం జరగకూడదని ఆమె ఉద్దేశం. ఆలోచిస్తూనే నిద్రపోయింది శారద.

ఆ మరుసటి రోజు ఆదివారం...

❀❀❀

ఉదయమే సుబ్రమణ్యం టిఫిన్ చేసి ఇండ్ల ప్లాట్లు చూసి వస్తానని బయల్దేరాడు. సంతోషంగా తలాడించింది శారద.

పది నిముషాలలో సైకిల్లో శంకర్ ఇంటికి చేరుకున్నాడు సుబ్రమణ్యం. అప్పటికే ఇళ్ళ స్థలాలు చూపే బ్రోకరు నాగయ్య అక్కడ ఉన్నాడు. నాగయ్యని శంకర్ పరిచయం చేశాడు సుబ్రమణ్యానికి. నాగయ్య టర్కీ టవల్ భుజాన వేసుకుని ఉన్నాడు. వయసు 35 ఏళ్లు ఉండవచ్చు మనిషి నల్లగా, బక్కగా ఉన్నాడు. అతను మహా తెలివైనవాడు అనిపించేలా ఉంది అతని మొహం.

"మీరు మండలాఫీసులో కదా పని చేసేది" అన్నాడు నాగయ్య.

"అవును, బాగా కనిపెట్టినారే!" అన్నాడు సుబ్రమణ్యం.

"మాకు ఎప్పుడూ మీ ఆఫీసుతోనే సార్, పనీ! నన్ను మీరు చూసి ఉండరు కానీ, నేను మిమ్మల్ని చూసినా!" అన్నాడు అతను నవ్వుతూ.

నాగయ్య వాలకం చూసి - ఇద్దో నాగయ్యా! అతను వొళ్ళి నిర్మొహమాటస్తుడు. నువ్వు ఎంత పరిచయమైనా నీ పని న్యాయమైనదైతేనే చేస్తాడు! అన్నాడు శంకర్.

"నాకూ అట్లాటోళ్లేనయ్యా కావాల్సిందీ!" అన్నాడు అదే నవ్వు మొహంతోనే.

"మంచి ప్లాటులు చూపించు నాగయ్యా! ఊరికి దూరంగా ఉండకూడదు" అన్నాడు శంకర్.

సుబ్రమణ్యం, నాగయ్యలు చెరొక సైకిల్లో బయల్దేరారు. పదిహేను నిమిషాల్లో బైపాసు రోడ్డు చేరుకున్నారు. ఆ చుట్టుపక్కల ఉన్న ఏడెనిమిది ప్లాట్లు చూపించాడు నాగయ్య. ఒక్కో ప్లాటు ఐదు సెంట్లు ఉంటుందనీ, 1 సెంటు 20 వేల రూపాయలుంటుందని చెప్పాడు. అతను చెప్పిన అన్నిటికీ 'ఊ' కొడుతున్నాడు. అయితే అతని దగ్గర 5 సెంట్లు ప్లాటు కొనేంత డబ్బు లేదు. పెద్దమ్మాయి పేరిట చేసిన రికరింగు డిపాజిట్టు మొత్తం ఏభై వేలు ఉంది. అంతే - దాన్ని కాస్త ఇంటి ప్లాటు కొనేయాలని నిశ్చయంతో ఉన్నాడు. మరి ఇప్పుడు చూస్తే 5 సెంట్లకి రిజిస్ట్రేషను ఖర్చులూ అవీ కలుపుకుని ఒక 'ల'కారం దాటిపోతుంది. ఏం చేయడం. ఆలోచనలో పడ్డాడు.

మరో ప్లాటుని చూపుతూ "ఈ ప్లాటు కార్నర్ ప్లాటు సార్! దీనికి తూర్పు నించీ పడమటికీ ఒక రస్తా - ఉత్తరం నించీ దక్షిణానికి ఒక రస్తా ఉంది. ఇదీ 5 సెంట్లే ఉండేది. ఏమంటే దీనికి పదివేలు ఎక్కువ కార్నర్‌ది కదా! అందుకని!" అంటూ చెప్పుకుపోతున్నాడు నాగయ్య.

గుడ్లప్పగించి చూస్తూ ఉన్నాడు సుబ్రమణ్యం.

"ఏం సార్! మాట్లాడరు" అన్నాడు నాగయ్య.

ఉలిక్కిపడ్డాడు సుబ్రమణ్యం - "చాలా రేట్లున్నాయప్పా ! ఇంటి స్థలానికే లక్ష రూపాయల పైనే పెట్టాలంటే నా చేత కాదు నాగయ్యా!" అన్నాడు.

"భలే వారు సార్ మీరు - మండలాఫీసులో పనిచేస్తా ఉండి ఇట్లా మాట్లు మాట్లాడతారే .. సరే సార్! పోనీ ఆడ కనబడతా ఉండయే కొట్టాలు దగ్గర అక్కడయితే సెంటు ఏడువేలు వుంది చూపిస్తాను

రాండిసార్! అంటూనే సైకిలెక్కాడు. నాగయ్యను అనుసరించాడు సుబ్రమణ్యం.

" ఆ కొట్టాలు ఎవరివి నాగయ్య అదేదో కాలనీలా ఉంది!" అడిగాడు సుబ్రమణ్యం.

"ఆ కాలనీ మాదే సార్ మా వాళ్ళదే!" అన్నాడు నాగయ్య.

"అంటే?" అన్నాడు సుబ్రమణ్యం.

మా బీదోల్లంతా ఇండ్లు లేవని చెప్పి పార్టీ వాళ్లతో కలిసి ఆందోళన చేసింటే మాకు ఈడ పట్టాలు ఇచ్చినారు సార్!" అన్నాడు సైకిలు నెమ్మదిగా పోనిస్తూ.

సూర్యుడు మబ్బుల్లో దాగున్నందు వల్ల వేడిగా అనిపించడం లేదు. అక్కడ బయలు స్థలము ఎక్కువగా ఉన్నందువల్ల పొదలు పొదలుగా సర్కారు జాలి చెట్లు పెరిగి ఉన్నాయి. ఏదో పని మీద అక్కడక్కడ మనుషులు తిరుగుతూ ఉన్నారు.

"నీకు ఇందులో పట్టా ఉందా నాగయ్యా!" అన్నాడు సుబ్రమణ్యం - జాగ్రత్తగా దారి వైపే చూస్తూ సైకిలు తొక్కుతున్నాడు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ముళ్ల కంప సైకిల్లోకి దిగిపోతుంది. అంతగా ఉన్నాయి ముళ్లు.

"ఉంది సార్! ఒకటి కాదు రెండున్నాయి సార్!" అంటూ ఆనందంగా చెప్పాడు.

సైకిలు తొక్కుతూనే "ఎంత అదృష్టవంతుడు నాగయ్య" అనుకుని అతని వైపొకసారి చూశాడు.

"ఇక్కడ దిగండి సార్! ఇక్కడంతా ముళ్లున్నాయి. సైకిలు దిగి దొబ్బుకుంటూ పొయ్యేదే మంచిది." అంటూ తనూ దిగాడు నాగయ్య. ఇద్దరూ సైకిళ్లు దిగి మెల్లగా తోసుకుంటూ నడుస్తున్నారు.

"అవునూ, నీకు రెండు ప్లాట్లు ఎట్లొచ్చినాయి?" అడిగాడు సుబ్రమణ్యం.

"మీరింకా ఆశ్చర్యపోతారు, ఆ రెండూ నా పేరిట లేవు సార్! ఆ పట్టాలు మా బంధువుల పేరుతో ఉన్నాయి."

"అసాధ్యుడవేనయ్యో!" అన్నాడు సుబ్రమణ్యం.

నేను మామూలు అసాధ్యుడను కాను ఎంతో అసాధ్యుడిని అనిపించుకోవాలను కొన్నాడేమో నాగయ్య - "ఈ మాత్రానికే నన్ను అసాధ్యుడంటే ఎట్ల సార్. ఈ రెండింటికే అదిరిపోతున్నారు ఈ ఊరు చుట్టూ ఉన్న ఇందిరా కాలనీ, గాంధీ కాలనీ, రహమత్ కాలనీ, ఎన్‌టి ఆర్ కాలనీల్లో నాకు ఎనిమిది ప్లాట్లు ఉన్నాయి."

అంటూ నాగయ్య చెబుతూ ఉంటే సుబ్రమణ్యం నిజంగానే అదిరిపోయాడు.

"ఏం జేసుకుంటావు అన్ని ప్లాట్లు?" అన్నాడు మరేమనాలో తెలీక.

ఒక్క క్షణం సైకిలు ఆపి పండితుడు ఒనామాలు రాని పామరుని వైపు చూసినట్టు ఒక చూపు విసిరి - "మీరు మండలాఫీసులో పనిజేస్తుండారు గానీ, మీకేమీ లోకం తెల్దయ్యా! ఇంటి ప్లాటుల్ని ఎవరయినా ఏం జేసుకుంటారు, ఒకటుంటే ఇల్లు కట్టుకుంటారు, రెండుంటే ఒకటి మంచి రేటు

చూసి ఒకనాడు అమ్మేస్తారు. నేనూ అదే పనే జేసేది. నాకు జీవనం ఈ బ్రోకరు పనీ, నా ప్లాట్లు అమ్ముకోవడమే సార్! ఇంట్లో ముగ్గురు పిల్లల్నీ, నా పెండ్లాన్నీ పోషించల్లగద సార్! మీ మాదిరి గవర్నమెంటు ఉద్యోగమా మాది. ఈ కాలనీల్లో చాలా మందికి నా మాదిరే అన్ని కాలనీల్లోనూ ఇండ్ల ప్లాట్లు ఉన్నాయి బినామీ పేర్లతో"" అన్నాడు నాగయ్య.

ఇదంతా వింటూంటే సుబ్రమణ్యం తల తిరిగి పోతోంది. ప్రభుత్వం పేదలకు చేస్తున్న మేలు గంగపాలవుతోందని ఉడికిపోయాడు.

"సార్ సార్ ఇక్కడ ఆగండి!" అన్నాడు నాగయ్య.

సుబ్రమణ్యం ఆగాడు.. కొద్ది దూరంలో కాలనీలోని కొట్టాలు ఆ కొట్టాల్లో అక్కడక్కడా పెద్దలూ, పిల్లలూ తిరుగుతూ ఉన్నారు.

"ఈ ప్లాటులనే సార్ నేను చెప్పింది... అగ్గువ రేటు ఇక్కడ ఒక్క విషయం మీకు చెప్పల్ల సార్! ఓలి తక్కువని గుడ్డిదాన్ని పెండ్లి జేసుకుంటే దొంతి కుండల్ని దొర్లాడిచ్చిందంట. అట్లుంటుంది ఈ ప్లాట్ల సంగతి. ఇవి అగ్గువ కొస్తాయని కొన్నారంటే ఇంగ అంతే... ఇవి ఇనాం భూములు. దీనికి రైతువారి పట్టా గవర్నమెంటు ఇవ్వలేదు, కాబట్టి రిజిష్టరాఫీసులో రిజిష్టరు కాదు. ఇంగ మీరు రైతువారీ పట్టా దెచ్చుగోవల్లంటే తల్లకిందుల తపస్సు చేయల్ల. మొన్న ఒకాయప్ప మూడు ప్లాట్లు కొనీ కన్న తిప్పలు పడతా ఉండాడు' అని నాగయ్య చెబుతూ ఉంటే, నీరుగారిపోయాడు సుబ్రమణ్యం.

ఇక ఓపిక నశించింది సుబ్రమణ్యానికి -

"నాకు ఏభై వేలల్లో మంచి ప్లాటు ఉండాల నాగయ్యా, మరెక్కడైనా చూడు ఇక్కడ మాత్రం వద్దులే- నాకు వేరే పనుంది వెళ్లొస్తా!" అని చెప్పేసి ఇంటి దారి పట్టాడు సుబ్రమణ్యం.

తనకు ఇంటి స్థలం యోగం లేదేమో అనిపిస్తోందతనికి. తను జీవితంలో ఏమైనా పొరపాటు చేశాడా? తన కొలీగ్స్ అందరికీ స్వంత ఇళ్లు ఉన్నాయి. తనకు కనీసం ప్లాటయినా లేదు. శారద అన్నట్టు అవినీతి సాకుతో తన అసమర్థతని సమర్థించుకుంటున్నాడా? నిజంగా తన వాళ్లని ఏమీ లేనివాళ్లుగా తయారు చేయబోతున్నాడా? ఆఫ్టాల్ 5 సెంట్ల ఇంటి స్థలం కొనలేని దుస్థితా తనది? ఈ విషయం శారదతో ఒప్పుకోబుద్ధి కాదు!

నాగయ్య ప్రభుత్వం కళ్లు గప్పి బినామీ పేర్లతో ఇంటి ప్లాటుల్ని స్వంతం చేసుకున్నాడు. రేప్పొద్దున్న ప్రభుత్వానికి ఈ నిజం తెలిసినా అతని బినామీ పట్టాని రద్దు చేస్తుంది అంతే - అతనికి పోయేదేముంది? ఆ తర్వాత మరేదైనా రాజకీయ పార్టీలో చేరి ఇంకో చోట ప్లాట్లు సంపాదిస్తాడు. తను అతనిలా సంపాదిస్తే నైతికంగా తప్పు చేసినట్టు తన మనసులో గిల్టీ ఫీలింగు మొదలవుతుంది. ఒకవేళ మనసుని చంపుకుని ప్లాటు సంపాదిస్తే ఎపుడయినా నిజం తెలిస్తే పరువు పోతుంది. అది పై అధికారుల దృష్టికి పోతే శిక్ష తీవ్రంగానే ఉంటుంది. ఇవన్నీ ఎంత చెప్పినా శారదకు అర్థం కాదు. ఇంటి ప్లాటులు మంజూరు చేయించే గుమాస్తాకి సొంతానికి ఒక్క ప్లాటూ లేదని ఈసడిస్తుంది. ఇలా ఆలోచిస్తూనే

ఇల్లు చేరాడు సుబ్రమణ్యం. ఇంటి ప్లాటులు ఏవీ తనకు నచ్చలేదని మాత్రం శారదతో చెప్పాడు అతను.

ఆ తర్వాతి రోజు ఆఫీసుకి వెళ్లి తన సీట్లో కూచున్నాడో లేదో - ఎదురుగా దిగులు మొహం వేసుకున్న ఒక మనిషి నిలబడి ఉన్నాడు. అతను చెన్నప్ప అని వెంటనే గుర్తించాడు సుబ్రమణ్యం. చెన్నప్పను చూడ్డం రెండోసారి అతనికి. మొదటిసారి పదిరోజుల క్రితం వచ్చాడు తన సీటు దగ్గరికి. తను రిక్షా తొక్కుతాడనీ, భార్య పిల్లలతో ఒక పాడుపడ్డ ఇంట్లో తలదాచుకుంటున్నాడనీ, తనకు ఇంటి ప్లాటు ఇస్తే చిన్న కొట్టం వేసుకుని బతుక్కుంటామని అన్నాడు. ఆఫీసర్ని కలవమన్నాడు సుబ్రమణ్యం. అప్పుడే చాలాసార్లు కలిసినట్టుగా చెప్పాడు అతను. సుబ్రమణ్యం మనసు కరిగిపోయింది. పది రోజుల తర్వాత కనబడు ఆలోగా ఆరై రిపోర్టు వస్తుంది. దాని మేరకు ఫైలు పెడతా!" అని హామీ ఇచ్చాడు. ఇదంతా ఒక క్షణంలో గుర్తొచ్చింది సుబ్రమణ్యానికి.

"చూడు చెన్నప్పా! ఆరైనించీ శనివారమే రిపోర్టు వచ్చిందప్పా! నీ ఫైలు అప్పుడే రాసి ఆఫీసరుకి ఉత్తర్వుల కోసరం పంపినా - ఈ పొద్దో రేపో వస్తుందిలే! నువ్వు మర్నాడు వచ్చి పట్టా కాగితం పట్టుకు పో!" అంటూ చిరునవ్వుతో చెప్పాడు సుబ్రమణ్యం. పట్టా కాగితం అందుకున్నంత సంతోషంతో "అట్లే గానీ సారూ! అంతా మీ దయ!" అంటూ వెళ్లిపోయాడు చెన్నప్ప.

ఫైలు రాసేసి ఆఫీసరుకు పెట్టినట్టు చెన్నప్పకి చెప్పాడే గానీ నిజానికి అతని ఫైలు రాయలేదు సుబ్రమణ్యం. శనివారం పని విపరీతంగా ఉండటంతో సోమవారం రాయొచ్చులే అనుకుని వాయిదా వేశాడు. ఆ మాటే అతనితో అంటే బాధపడతాడేమోనని అలా అబద్ధం ఆడాడు తను. అరగంటలో చెన్నప్ప ఫైలు రాసేసి సూపర్నెంటుతో సంతకాలు పెట్టించుకుని నేరుగా ఆఫీసరు గదిలోకి వెళ్లాడు సుబ్రమణ్యం.

ఆఫీసరు సిగరెట్టు కాలుస్తూ ఏదో ఫైలు చూస్తూ ఉన్నాడు.

సుబ్రమణ్యం అడుగుల చప్పుడుతో తలెత్తి చూసి "ఏం సుబ్రమణ్యం!" అడిగాడు ఆఫీసరు.

"సార్! ఇదీ చెన్నప్ప ఫైలు.. అతను చాలా బీదవాడు సార్.. అతనికి ఇంటి ప్లాటూ.." అంటూ చెప్పబోతుంటే.

"నువ్వు రాసేవన్నీ అట్లాంటి ఫైళ్లేలే... అక్కడ పెట్టు" అన్నాడు నిర్లిప్తంగా - ఆఫీసరు.

ఫైలు టేబులు పైన పెట్టేసి వెనుతిరిగాడో లేదో,

"ఇద్దో సుబ్రమణ్యం! ఈ రిపోర్టు ఇప్పుడే ఆరై ఇచ్చినాడు. వెంటనే పట్టా ఫారం రాసి పట్టుకురా!" అన్నాడు ఆఫీసరు.

"సరే సార్!" అంటూ ఆఫీసరు అందించిన రిపోర్టుని తీసుకుని తన టేబులు దగ్గరికి వచ్చాడో లేదో, ఎదురుగా నాగయ్య!

"ఏం నాగయ్యా! మరేదయినా ఇంటి ప్లాటు చూసినావా?" నవ్వుతూ అడిగాడు సుబ్రమణ్యం.

"లేద్సార్! నా సొంత పని మీద వస్తి..."

"ఏం పనీ" అడిగాడు సుబ్రమణ్యం.

"నాకు ఇంటి ప్లాటు కావాలని అర్జీ పెట్టుకొనింటి. ఆర్ఐ రిపోర్టు ఇచ్చినాడంట కద సార్!" మీ చేతిలో ఉండేది అదే అయివుంటుంది."

"ఇదా?" అంటూ రెండు నిమిషాలు విహంగ దృష్టితో రిపోర్టును తిరగేశాడు. ఆ రిపోర్టు నాగయ్యదే!

"అవునూ.. నీకెట్లా వస్తుంది ఇంటి ప్లాటూ? ఇప్పటికే నీకు చాలా ఇంటి స్థలాలు ఉన్నాయి కదప్పా!" అన్నాడు సీరియస్సుగానే "సార్ సార్ మీరే అట్లంటే ఎట్ల పేదోడిని.. ఇది నా సొంత ప్లాటు! అన్నాడు బతిమాలుతూ నాగయ్య.

"సరే రేపురా రాసిపెడతా!" అన్నాడు.

"బిరీన రాసి పెట్టింది సార్! బీదోణ్ణి!" అంటూ వెళ్లిపోయినాడు.

సుబ్రమణ్యం ఆలస్యం చేయకుండా ఆఫీసరు గదిలోకి దూరాడు.

"ఇద్దో సుబ్రమణ్యం ఈ చెన్నప్ప ఫైలు అప్పుడే రాసిపెట్టినానే ఆర్ఐ నించీ రిపోర్టు వస్తూనే రాసి పెట్టేదేనా? ఏవి వెంటనే రాయల్లో, ఏవి నెమ్మదిగా రాయల్లో నీకు తెలీనే తెలీదప్పా! పలుకుబడి ఉండే వాళ్లవి ముందుగా రాసిపెట్టాల. అప్పుడే మనల్ని మనం రక్షించుకుంటాం. ఈ చెన్నప్ప అట్లా వాళ్లది ఎప్పుడు రాస్తే అడిగే దిక్కెవరు" ఆఫీసరు ఈ మాట అన్నప్పుడు సుబ్రమణ్యం గుండెల్లో కళుక్కుమంది.

"అది సరే ఇప్పుడు రిపోర్టు ఇస్తినే అది రాస్తున్నావా?" అనడిగాడు ఆఫీసరు.

"దాని విషయమే మీతో చెప్పేకి వస్తిని సార్! ఆ నాగయ్యకి ఈ ఊర్లో మనం పట్టాలు మంజూరు చేసిన చాలా కాలనీలల్లో బినామీ పేరుతో పట్టాలు ఉన్నాయి సార్!" అంటూ ఆవేశంగా చెప్పాడు సుబ్రమణ్యం.

"నాకు తెలుసులేవయ్యా! మనం నాగయ్యని చూసి కాదు పట్టాలు ఇచ్చేది. అతని వెనక ఉన్న పెద్దవాళ్లని చూసి. వాళ్లు తలుచుకుంటే మన జీవితాలే తారుమారయి పోతాయి. మరి, మరేమీ ఆలోచించవద్దు. నీకే పాపం అంటదు కానీ ముందు గంటలో ఆ ఫైలు రాసి నా టేబులు మీద పెట్టు". అంటూ సానునయంగా చెప్పాడు ఆఫీసరు.

దిమ్మెరపోయి వింటూ ఉన్న సుబ్రమణ్యం యాంత్రికంగా తల ఆడించి, మెల్లగా అడుగులు వేస్తూ తన సీటుకి చేరుకున్నాడు.

- సాహిత్య నేత్రం, ఉగాది విశేష సంచిక 1997.